మొదలైన రేషన్ కష్టాలు

పాత రేషన్ పంపిణీ పద్ధతి తొలిరోజే అట్టర్ ఫ్లాప్ అయింది. డీలర్లు సమయపాలన పాటించలేదు. సర్వర్ మొరాయించింది. కార్డుదారులు గంటల కొద్ది నిరీక్షించాల్సి వచ్చింది. వృద్ధులు క్యూలో నిలబడలేక అవస్థలు పడ్డారు. తీసుకున్న రేషన్‌ను ఇంటికి చేర్చేందుకు ముప్పుతిప్పలు పడ్డారు. ఇంటి వద్దకే రేషన్ వచ్చి ఉంటే ఈ బాధలు తప్పేవని కార్డుదారులు ప్రభుత్వం తీరుపై మండిపడ్డారు. కాగా చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లో రేషన్ పంపిణీ ఆదివారం పడకేసింది.


మొరాయించిన సర్వర్


చిత్తూరునగరం చామంతిపురం ప్రాంతంలో రేషన్ పంపిణీకి క్యూలో వేచివున్న కార్డుదారులు

- పాత పద్ధతిలో ప్రారంభమైన రేషన్ పంపిణీ
- సమయపాలన తుస్
- మొరాయించిన సర్వర్
- రేషన్‌కు పడిగాపులు
- ఇంటింటికి రేషన్ రాకపోవడంతో కార్డుదారుల అవస్థలు

కాణిపాకం: ఇంటి వద్దకే రేషన్ పంపిణీ వ్యవస్థను రద్దు చేసిన కూటమి ప్రభుత్వం పాత పద్ధతిలో చేపట్టేందుకు శ్రీకారం చుట్టింది. జూన్ 1వ తేదీన (ఆదివారం) పండుగ వాతావరణంలో రేషన్‌ను పంపిణీ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. కార్డుదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా రేషన్ పంపిణీ చేయాలని ముందస్తుగానే చర్యలు తీసుకుంది. నీడ, నీళ్లు, కుర్చీలు అందుబాటులో ఉంచాలని సూచించింది. చాలా షాపుల్లో అవేవీ కనిపించలేదు. కొన్నిచోట్ల తేలికపాటి అలంకరణ చేసి షో నడిపించారు. చాలా చోట్ల నిలువ నీడలేక ఎండకు అల్లాడిపోయారు. కొన్ని చోట్ల నీళ్లు అందుబాటులో ఉంటే మరికొన్ని చోట్ల అందుబాటులో లేవు. కూర్చోవడానికి కుర్చీలు కరువయ్యాయి. ఎండకు ముందు రేషన్ తీసుకుందామని వచ్చిన పండుటాకులు షాపుల వద్ద విలవిలలాడిపోయారు. ఇక చాలా షాపుల వద్ద డీలర్లు సమయపాలన పాటించలేదు. వారి ఇష్టానుసారంగా షాపులు తెరిచి పంపిణీని మొదలుపెట్టారు. ఉదయం 10 గంటలు దాటినా చాలా చోట్ల షాపులు తెరుచుకోలేదు. దీంతో కార్డుదారులు క్యూలో వేచి ఉండలేక ఎండ తాపానికి అల్లాడిపోయారు. ఆ తర్వాత సాంకేతిక సమస్యలు చుట్టిముట్టాయి.

సర్వర్ డౌన్

రేషన్ పంపిణీ ఉదయం చాలా చోట్ల గంటపాటు సాగింది. ఆ తర్వాత సర్వర్ మొరాయించింది. ఈ సమస్యను గుర్తించలేక చాలా మంది డీలర్లు కార్డుదారులుకు రేషన్ పంపిణీ చేసేందుకు బయోమెట్రిక్ మిషన్‌తో కుస్తీ పట్టారు. యూఐడీ ఎర్రర్ చూపిస్తోందని.. పదేపదే దాని వెంట పడ్డారు. తీరా అన్ని చోట్లా సర్వర్ సమస్య ఉందని తెలుసుకున్నారు. మధ్యాహ్నం దాటినా సర్వర్ సమస్య తీరలేదు. దీంతో చాలా మంది కార్డుదారులు రేషన్ కోసం వేచి చూసి ఇంటికి వెళ్లిపోయారు. మరికొందరు మాత్రం అక్కడే కాపు కాచారు.

ఇంటికి రాని సరుకులు

గతంలో రేషన్ సరుకులను ఇంటి వద్దే పంపిణీ చేసేవారు. ఎండీయూ ఆపరేటర్లు, డీలర్లు ఇచ్చిన సమాచారంతో సమయానికి ఇంటి ముందే సరుకులు పొందేవారు. పడిగాపులు కాసే పని ఉండేది కాదు. ఆదివారం నుంచి ప్రారంభమైన పాత రేషన్ పంపిణీ విధానం కార్డుదారులకు కన్నీళ్లు తెప్పిస్తున్నాయి. దూరపు ప్రాంతాల నంచి వచ్చి రేషన్ తీసుకోవాలంటే అష్టకష్టాలు పడుతున్నారు. ఆటోలు, ఇతరత్రా వాహనాలను ఆశ్రయించి షాపునకు సరుకులు తీసుకొచ్చేందుకు వస్తున్నారు. వృద్ధులు నానా అగచాట్లు పడుతున్నారు. దీంతో పాత పద్ధతిపై కార్డుదారులు పెదవి విరుస్తున్నారు. మళ్లీ ఇంటింటికీ రేషన్ విధానం వస్తే బాగుంటుంది. ఈ పడిగాపులు మాకొద్దని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రేషన్ పంపిణీలో పనిచేయని సర్వర్

తవణంపల్లె: మండలంలో ఆదివారం 44 చౌక దుకాణాల ద్వారా రేషన్ సరుకుల పంపిణీని డీలర్లు ప్రారంభించారు. ఉదయం 8 గంటల నుంచి ఈపాస్ మెషిన్లు పని చేయలేదు. కార్డుదారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. మండలంలోని ముత్తరపల్లె చౌక దుకాణంలో పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ సరుకుల పంపిణీని లాంఛనంగా ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ 65 ఏళ్లు నిండిన వారితోపాటు వికలాంగులకు ఇంటి వద్దే సరుకులు అందజేస్తామన్నారు. కార్డుదారులకు సరుకులను సక్రమంగా పంపిణీ చేయాలని డీలర్లను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.


తవణంపల్లెలో సరుకుల కోసం నిరీక్షిస్తున్న కార్డుదారులు

మండలం	కార్డుల సంఖ్య
బంగారుపాళ్యం	22106
చిత్తూరు	50731
గుడిపాల	12500
పూతలపట్టు	13329
తవణంపల్లి	16090
యాదమరి	13973
ఐరాల	15359

రెండు గంటలుగా నిరీక్షిస్తున్న



ఈ రోజు బియ్యం డీలర్ దగ్గరే తీసుకోవాలని చెప్పడంతో తెల్లవారి వచ్చాను. రెండు గంటలైనా మెషిన్ పనిచేయలేదని చెప్పారు. ఇక్కడే కూర్చున్నాను. బియ్యం ఇచ్చాక ఎవరినో ఒకరిని బతిమాలుకుని ఇంటిదగ్గర వదిలి పెట్టమని అడగాలి. ఎందో ఈ పరిస్థితి నాకైతే అర్థం కాలేదు. –ప్రమీల, యాదమరి

క్లుప్తంగా

నేడు కార్పొరేషన్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్‌డే) నిర్వహించనున్నట్లు కమిషనర్ నరసింహప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి అర్జీలు స్వీకరిస్తామని, ప్రజలు ఫిర్యాదులు అందజేసి సమస్యలను పరిష్కరించుకోవచ్చని వెల్లడించారు.

ఐరాలలో..

ఐరాల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ మహేష్‌కుమార్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామని వెల్లడించారు. మండల ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో తెలియజేసి పరిష్కరించుకోవాలని కోరారు.

రామ్మూర్తి సేవలు శ్లాఘనీయం


రామ్మూర్తిని సన్మానిస్తున్న అధికారులు

గుడిపాల: మండలంలోని వసంతాపురం గ్రామానికి చెందిన రామ్మూర్తి ఆర్టీసీలో 39 ఏళ్లు చేసిన సేవలు శ్లాఘనీయమని మాజీ సర్పంచ్ రెడ్డెప్ప కొనియాడారు. వసంతాపురంలో ఆదివారం రామ్మూర్తి ఉద్యోగ విరమణ సన్మాన సభను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 39 సంవత్సరాలు సుదీర్ఘంగా నిజాయితీగా పనిచేయడం అదృష్టమన్నారు. ఉద్యోగంలో సమయ పాలన పాటించడంలో రామ్మూర్తికి ఎవరూ సరికాదన్నారు. ఆయన అడుగుజాడల్లోనే ప్రతి ఒక్కరూ పనిచేసినట్లయితే ప్రతి ఒక్క ఉద్యోగికీ మంచి గుర్తింపు ఉంటుందన్నారు.

నేడు 35 యర్లంపల్లెలో ఫ్యామిలీ డాక్టర్

ఐరాల: మండలంలోని 35 యర్లంపల్లెలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. 104 వాహనంలో వైద్య బృందంతో కలిసి గ్రామంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 వరకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తామన్నారు. గర్భిణులకు బీపీ, షుగర్, ఈసీజీ, థైరాయిడ్ పరీక్షలు చేస్తామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం


విరాళం అందజేస్తున్న దాత

కాణిపాకం: కాణిపాకంలో వెలసిన శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన ట్రస్టుకు ఆదివారం రూ.లక్ష విరాళాన్ని తిరుపతికి చెందిన భాగ్యవతి అందజేశారు. నగదును అధికారులకు ఇచ్చారు. వారికి అధికారులు స్వామి వారి ప్రత్యేక దర్శనం కల్పించారు.

రెండు పేయ దూడలకు జన్మనిచ్చిన ఆవు


రెండు దూడలతో ఆవు

బంగారుపాళెం: మండలంలోని పాలమాకులపల్లెకు చెందిన రైతు కావలి శ్రీనివాసులు పాడిఆవు ఆదివారం రెండు పేయ దూడలకు జన్మనిచ్చింది. సాధారణంగా పశువు ఒక ఈతలో ఒక దూడను మాత్రమే ఈనుతుంది. ఇలా రెండు దూడలను ఈనడం అరుదని వైద్యులు చెబుతున్నారు. తన పాడిఆవు రెండు పేయ దూడలకు జన్మనివ్వడం సంతోషంగా ఉందని రైతు తెలిపాడు.

అర్ధగిరిలో ఆంజనేయస్వామికి విశేష పూజలు


ఆంజనేయస్వామి విగ్రహం వద్ద దాతలు

తవణంపల్లె : ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరిలో వీరాంజనేయస్వామి స్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. సహజ సిద్ధమైన సంజీవ రాయ పుష్కరిణి ముందు దాతలు ఏర్పాటు చేసిన ఆంజనేయస్వామి విగ్రహం వద్ద భక్తులు కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. స్వామి వారి అనుగ్రహం వల్లే తాము విగ్రహాన్ని ఏర్పాటు చేసి స్వామికి సేవ చేస్తున్నామని దాతలు తెలిపారు. ఆలయ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామన్నారు. అదే విధంగా గోశాలలో ఉన్న పశువుల పోషణకు సాయం అందిస్తామన్నారు.

నేడు పోస్టర్ ఆవిష్కరణ

చిత్తూరు కార్పొరేషన్ : వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో జూన్ 4న వెన్నుపోటు దినం కార్యక్రమం నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో పోస్టర్ విడుదల చేయనున్నట్లు చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి తెలిపారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా చిత్తూరు పార్లమెంట్ పరిశీలకులు రాజశేఖర్‌రెడ్డి వస్తారని తెలిపారు. అనంతరం నగరంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో కార్యక్రమంపై సమావేశం ఉంటుందన్నారు. కార్యకర్తలు, నాయకులు సోమ వారం ఉదయం 9.30 గంటలకు పార్టీ కార్యాలయానికి చేరుకోవాలని వివరించారు.

గరుడ వాహనంపై విహరించిన ఇంద్రవరదుడు



యాదమరి: వరదరాజస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఐదో రోజు ఆదివారం ఉదయం స్వామి వారు పక్షిరాజు వాహనంపై కొలువై మాడవీధుల్లో విహరించారు. గరుడ పక్షులు విహంగ వీక్షణం ద్వారా గోపుర దర్శనమైన పిదప అశేష భక్తజనం నడుమ వాహన సేవను ప్రారంభించారు. ఈ ఆసక్తికర సన్నివేశం కోసం భక్తులు ఆకాశం వైపు చూస్తూనే ఉన్నారు. గరుడ సేవ సందర్భంగా ఆలయ ప్రాంగణం, మాడవీధులు గోవింద నామస్మరణతో మారుమోగాయి. గరుత్మంతుని వాహనంలో విహరించే స్వామి వారిని దర్శిస్తే సకల పాపాలు హరిస్తాయని భక్తుల విశ్వాసం. అంతకుముందు స్వామి వారి మూల విరాట్టుకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి ఇంద్రవరదుడు కల్పవృక్ష వాహనంపై మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. సోమవారం ఉదయం హనుమంత వాహనం, రాత్రి గజ వాహనం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

అలరించిన దుర్యోధన వధ




దుర్యోధన వధ కార్యక్రమాన్ని తిలకించడానికి వచ్చిన భక్తులు


యుద్ధంలో తలపడుతున్న భీమ, దుర్యోధన పాత్రధారులు

గుడిపాల: మండలంలోని పిళ్లారికుప్పం గ్రామంలో ఉన్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో గత 18 రోజులుగా జరుగుతున్న మహాభారత ఉత్సవాలు ఆదివారం దుర్యోధన వధ ఘట్టంతో ముగిసింది. ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజలు చేశారు. తదుపరి భాగవతారణి రాణిరెడ్డి హరికథా గానం చేశారు. మధ్యాహ్నం దుర్యోధన వధ ఘట్టాన్ని కళాకారులు రక్తి కట్టించారు. దుర్యోధనుడు గంగ మడుగులో దాక్కుని ఉండగా.. అతన్ని బయటికి వచ్చేలా చేసిన భీమసేనుడు చేసే యుద్ధ సన్నివేశం ఆహూతులను అలరించింది. ఆలయ ఆవరణలో ఏర్పాటుచేసిన దుర్యోధనుడి ప్రతిమ వద్ద సాగిన భీమ, దుర్యోధన వేషధారుల భీకరపోరు భక్తులను కట్టి పడేసింది. అనంతరం ధర్మరాజుల పట్టాభిషేకం నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి అగ్నిగుండ ప్రవేశాన్ని భక్తి ప్రపత్తులతో నిర్వహించారు.

మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు


పిల్లల తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇస్తున్న సీఐ శ్రీనివాసులు

బంగారుపాళెం : మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని సీఐ శ్రీనివాసులు హెచ్చరించారు. ఆయన ఆదివారం సాయంత్రం పాలేరు బ్రిడ్జి వద్ద చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిపై వాహనాలు తనిఖీ చేపట్టారు. ఇద్దరు మైనర్లు ద్విచక్రవాహనాలు నడుపుతుండగా పట్టుకున్నారు. వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. సీఐ మాట్లాడుతూ మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామన్నారు. లైసెన్స్ లేని మైనర్లు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమన్నారు. పిల్లలకు వాహనాలు ఇవ్వరాదని, అలా వాహనాలు ఇచ్చిన వారి లైసెన్స్‌లు రద్దు చేస్తామని తెలిపారు. అదే విదంగా జరిమానాలు విధిస్తామని తెలిపారు.

ఘనంగా రావూరి జన్మదిన వేడుకలు


కేక్ కట్ చేస్తున్న దృశ్యం

కాణిపాకం: పూతలపట్టు పరిధిలోని ఎస్వీసెట్ ఇంజినీరింగ్ కాలేజీ చైర్మన్ రావూరి వెంకటస్వామి జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా రావూరి వెంకటస్వామికి పలువురు అభిమానులు, కాలేజీ అధ్యాపకులు శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రావూరి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిలో వారానికి కూలి రూ.350


పనిచేస్తే కాని డొక్కాడని బతుకులు వారివి. వారం రోజులు పనిచేస్తే వచ్చిన కూలి రూ.350. ఇదేంటని అడిగితే మీరు చేసిన పనికి కూలి అంతే వస్తుందని ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ చెప్పడంతో అవాక్కవుతున్నారు. చేసేదీమీ లేక పనులకు వెళ్లకుండా ఉండిపోతున్నారు. ఇది గుడిపాల మండలంలోని చీలాపల్లె పంచాయతీకి చెందిన ఉపాధి కూలీల దుస్థితి.


ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలు

- కూలీలకు అందని గిట్టుబాటు ధర
- పనులు చేయడానికి ఇష్టపడని ఉపాధి కూలీలు

గుడిపాల: చీలాపల్లె పంచాయతీలోని రాసనపల్లెలో పది మంది కూలీలు గ్రూపుగా ఏర్పడి ఉపాధిహామీలో కూలి పనులకు వెళ్తున్నారు. వీరితో పాటు ఇదే దళితవాడలో మరికొంత మంది కూడా పనులకు వెళ్తున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ కొంత మందిపై కక్షపూరితంగా వ్యవహరిస్తూ కొలతల ప్రకారం పనులు కల్పించడం లేదు. దీంతో గిట్టుబాటు కూలి అందడం లేదు. ఇదేమిటని ప్రశ్నిస్తే కూలీ పనులు కూడా చూపించేది లేదని తెగేసి చెబుతున్నారని కూలీలు వాపోతున్నారు. కూలి గిట్టుబాటు కావడం లేదని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని చెబితే జాబ్‌కార్డులను చించి వేస్తామని బెదిరిస్తున్నారని వారు వాపోతున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్‌కు అనుకూలంగా ఉన్నవారికి అధిక మొత్తంలో కూలి గిట్టుబాటు అయ్యేలా పనులు కల్పిస్తున్నారని, ప్రతిరోజూ కూలిపనికి వెళితే ఫొటోలు తీసుకుంటున్నారు తప్ప గిట్టుబాటు అయ్యేలా పనులు చూపించడం లేదని వారు వాపోతున్నారు. ఇప్పటికే తమకు 10 వారాలకు పైన కూలి డబ్బులు రాలేదని, కూలి పనులకు వెళ్లకుండా నిలిచిపోతున్నట్లు తెలిపారు.

కూలి రూ.350 ఇస్తున్నారు



వారంలో ఆరు రోజులు కూలి పనులకు వెళ్తే రూ.350 బ్యాంకు ఖాతాకు జమ చేశారు. ఏమని ఫీల్డ్ అసిస్టెంట్‌ను అడిగితే మీరు చేసిన పనికి అంతే అని సమాధానం ఇస్తున్నారు. ఇతర కూలీలకు మాత్రం 1300 దాకా ఇస్తున్నారు. మాపై కక్షగట్టి పనులు సరిగ్గా చూపించకుండా కూలి రేట్లు తగ్గించి ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఉన్నతాధికారులకు తెలియజేస్తామంటే జాబ్‌కార్డులను చించివేస్తామని బెదిరిస్తున్నారు.

– కృపాకరన్, చీలాపల్లె, గుడిపాల

వారం రోజులకు రూ.500లు ఇచ్చారు



నేను ఉపాధిహామీ పనులకు వెళ్తున్నాను. నాకు వారానికి రూ.500లు ఇచ్చారు. ఏమిటని ప్రశ్నిస్తే మీకు ఇచ్చేది అంతే అని తెగేసి చెబుతున్నారు. మాతో పనిచేసే కూలీలకు మాత్రం రోజుకు రూ.257లు ఇస్తున్నారు. మేము అడిగితే మీరు చేసే పనులకు అంతే ఇస్తామని చెబుతున్నారు. రైతుల వద్దకు కూలికి వెళితే రోజుకు రూ.300 ఇస్తున్నారు. ఇక్కడ మాత్రం ఇలా ఇవ్వడం విడ్డూరంగా ఉంది. – ప్రియ, రాసనపల్లె, గుడిపాల

ఉపాధి పనులకు వెళ్లడం లేదు



వారంలో ఆరు రోజులు పనులకు వెళ్తే రోజుకు కూలి రూ.100 చొప్పున రూ.600 ఇచ్చారు. ఏమిటని అడిగితే మీకు ఇచ్చేది అంతే అని ఫీల్డ్ అసిస్టెంట్ చెబుతున్నారు. ఎంత అడిగినా వారి నుంచి స్పందన లేదు. ప్రస్తుతం ఉన్న నిత్యావసర రేట్లలో రోజుకు కూలి ఎవరైనా రూ.100 ఇస్తారా. ఇది చాలా దారుణం. అధికారులు వీటిపై స్పందించాలి. అందువల్లే ఉపాధి పనులకు వెళ్లడం లేదు.

– బాబుషాలిని, రాసనపల్లె, గుడిపాల

ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియడం లేదు



మేము ఉపాధి పనులకు వెళ్తే గిట్టుబాటు కూలి అందడం లేదు. ప్రశ్నించి అడిగితే పనులు లేవని చెబుతున్నారు. మాతోటి కూలీలకు మాత్రం పనులు ఇచ్చి వారికి గిట్టుబాటు కల్పిస్తున్నారు. మాపై కక్షగట్టి వేధిస్తున్నారు. దీంతో ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియడం లేదు. ఉపాధిహామీ కార్యాలయంలో ఫిర్యాదు చేద్దామంటే మీ జాబ్‌కార్డులను చించివేస్తామని ఫీల్డ్ అసిస్టెంట్ భయపెడుతున్నారు.

– మంజుల, చీలాపల్లె, గుడిపాల

రోజుకు రూ.300 ఇవ్వాలి



మేము ఉపాధి హామీ కూలీ పనులకు వెళ్తే కనీసం రోజుకు రూ.300 ఇవ్వాలి. పనులకు వెళ్తే రోజుకు రూ.100 కూడా ఇవ్వడం లేదు. ఏమిటని అడిగితే సమాధానం లేదు. దీంతో కుటుంబాలను ఎలా పోషించాలి. ఇప్పటికే పది వారాలు కూలి డబ్బులు రావాలి. ఎంత ఇస్తారో కూడా తెలియడం లేదు. పనిచేసేటప్పుడు ఒక మాట పని అయ్యిన తరువాత మరోమాట మాట్లాడుతున్నారు.

– సంపంగి, చీలాపల్లె, గుడిపాల

నేడు ఇళ్ల స్థలాల కోసం ధర్నా


పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: ఇళ్ల స్థలాల కోసం జిల్లాలోని అన్ని తహసీల్దార్ కార్యాలయాల వద్ద సోమవారం ధర్నా చేయనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు తెలిపారు. ఆయన ఆదివారం గాంధీ విగ్రహం వద్ద పోస్టర్లు విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ చిత్తూరు జిల్లాలో వేలాది మంది నిరుపేదలు అద్దె ఇళ్లలో ఉంటూ ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నివాస స్థలాల కోసం అర్జీలు పెట్టుకున్న ప్రతి నిరుపేదకు న్యాయం చేయాలన్నారు. అర్హత కలిగిన వారికి నగరంలో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు గోపీనాథ్, మణి, కుమారి, దేవయాని తదితరులు పాల్గొన్నారు.